క్లుప్తంగా

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

డీఎస్పీ జనార్ధనరావు



తెనాలిరూరల్: చవితి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత పోలీసు స్టేషన్ల నుండి అనుమతులు పొందాలని డీఎస్పీ బి.జనార్ధనరావు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మట్లాడారు. ఈ నెల 18వ తేదీన వినాయక చవితి సందర్భంగా మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. మండపాలు ఏర్పాటు చేసే వారు ముందుగా ఒక కమిటీగా ఏర్పడాలని, ఐదుగురు సభ్యుల గుర్తింపు కార్డులను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలాగే తప్పనిసరిగా తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో వివరాలు సమర్పించి అనుమతులు తీసుకోవాలని సూచించారు. విద్యుత్, ఫైర్ విభాగాల వారి వద్దా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేయడం, డీజే బాక్సులు పెట్టడం వంటివి చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. కమిటీ సభ్యులు నిరంతరం మండపాల వద్ద ఉండేలా చూసుకోవాలన్నారు. నిమజ్జనం రోజు రూట్ మ్యాపును ముందుగా పోలీసులకు తెలపాలని మండపాల వద్ద, నిమజ్జనం రోజున ఊరేగింపు సమయాల్లో జాగ్రత్తలు పాటించాలని డీఎస్పీ సూచించారు. సమావేశంలో సీఐలు కె. శ్రీనివాసరెడ్డి, కె. చంద్రశేఖర్, ఎస్. వెంకట్రావు ఉన్నారు.

నేడు కొత్తగా 449 మందికి పింఛన్ల పంపిణీ

కొల్లిపర: మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం ద్వారా వివిధ గ్రామాల్లో కొత్తగా పెన్షన్ మంజూరైన లబ్ధిదారులకు శాసనసభ్యులు అన్నాబత్తుని శివకుమార్ చేతుల మీదుగా బుధవారం ఉదయం 10 గంటలకు కొల్లిపర గ్రామంలోని పాలకేంద్రం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో లబ్ధిదారులకు పెన్షన్ సొమ్ము , మంజూరు పత్రాలు అందజేయనున్నట్లు ఎంపీడీవో వి.విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మంజూరైన లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు , నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్యాస్ పొయ్యి వంట సామాను వితరణ



కొల్లిపర: కొల్లిపర గ్రామానికి చెందిన అన్నవరపు నరసింహారావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి గౌరీ పార్వతి , కుమారులు రవికుమార్, సతీష్ తమ కుటుంబం తరపున సుమారు రూ.20 వేలు విలువైన గ్యాస్ పొయ్యి , వంట సామాను మంగళవారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అన్నవరపు రమేష్‌తో కలసి దాతలు హైస్కూల్ హెచ్ఎం ఈదా సాంబిరెడ్డికి అందజేశారు.ఈ సందర్భంగా సాంబిరెడ్డి మాట్లాడుతూ దాతలు ఈ విధంగా పిల్లలకు మధ్యాహ్న భోజనం తయారీకి ఉపయోగకరంగా ఉండేలా వంట సామాను అందించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం దాతలను విద్యార్థులతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మునగాల రాంప్రసాద్, సంజీవ కుమార్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకులపై కేసు నమోదు

కొల్లిపర: 144 సెక్షన్ నిషేధాజ్ఞలు అమల్లో ఉన్నా వాటిని అతిక్రమించిన టీడీపీ నాయకులపై కేసు నమోదైంది. చంద్రబాబు రిమాండ్‌ను నిరసిస్తూ టీడీపీ నాయకులు సోమవారం సాయంత్రం కొల్లిపర ప్రధాన కూడలిలో వాహన రాకపోకలకు అంతరాయం కల్పించారు. అంతటితో ఆగకుండా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి తెలిపారు.

గుండెపోటుతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి

కర్లపాలెం: తహసీల్దారు కార్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న పి.ఆంజనేయులు(45) మంగళవారం గుండెపోటుతో మృతిచెందారు. వివరాల మేరకు.. ఉదయం 9గంటలకు తహసీల్దారు కార్యాలయానికి వెళ్లిన ఆంజనేయులు గుండె దడగా ఉందని, టాబ్లెట్ వేసుకుని వస్తానని సిబ్బందికి చెప్పి తన ఇంటికి వెళ్లాడు. పరిస్థితి విషమించటంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేటు వైద్యుని వద్దకు తీసుకెళ్లారు. వైద్యుడి సలహా మేరకు బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకుని వెళ్లారు. అప్పటికే అతను మృతిచెందాడని వైద్యులు నిర్ధారించారు. ఆంజనేయులుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తహసీల్దారు కేశవనారాయణరావు, కార్యాలయ సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.

నూతన పింఛన్లు పంపిణీ

తెనాలిఅర్బన్: వైఎస్సార్ పెన్షన్ కానుక కింద తెనాలి పట్టణంలో నూతనంగా మంజూరు అయిన పింఛన్లను మంగళవారం పలు వార్డుల్లో పంపిణీ చేశారు. 5వ వార్డులో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ తోట రఘురామ్, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభానీ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొత్తం 23 పింఛన్లు మంజూరు అయ్యాయని, కొన్ని సాంకేతిక కారణాల వల్ల పంపిణీ ఆలస్యమైందని చెప్పారు. అలాగే 6వ వార్డులో నూతనంగా మంజూరు అయిన 12 పింఛన్లను వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జిలు పోతిరెడ్డి హేమలత, పోతిరెడ్డి నాగరాజులు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్ల పంపిణీ కొనసాగుతోంది. మంగళవారం పట్టణ 14వ వార్డులో కొత్తగా పింఛన్లు మంజూరైన 18 మందికి వార్డు కౌన్సిలరు దాసరి వీరవసంతరావు పింఛను మొత్తాలను అందజేశారు. ఇకపై ప్రతినెలా ఒకటోతేదీన వలంటీర్ల ద్వారా పింఛను అందుకోవచ్చని లబ్ధిదారులకు తెలియజేశారు. సచివాలయ అడ్మిన్ ఎం.ఎస్.రెడ్డి, వెల్ఫేర్ సెక్రటరీ కె.వెంకటేశ్వర్లు, పి.బ్రహ్మయ్య శాస్త్రి, స్థానిక నాయకులు మున్నంగి సత్యం, జాలాది దయారత్నం, కొణిదల ఆదాం పాల్గొన్నారు.



5వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ రఘురామ్, కో-ఆప్షన్ సభ్యుడు సుభానీ



14వ వార్డులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ వీరవసంతరావు

విద్యార్థులకు కంటి పరీక్షలు

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా..

వల్లభాపురం(కొల్లిపర): విద్యార్థులు ప్రతి రోజు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవటం వలన ఆరోగ్యంగా ఉండటమే కాకుండా వయసు పెరిగే కొద్దీ కంటి సమస్యలు రాకుండా ఉంటాయని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎం.ఆశీర్వాదం, డాక్టర్ సీహెచ్ సునీత అన్నారు. మంగళవారం మండలంలోని వల్లభాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 120 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా 13 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వీరికి త్వరలో ఉచితంగా కళ్ల జోళ్లు అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీమన్నారాయణ, ఆశాకార్యకర్త ఎస్.సీతామహాలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎం.ఆశీర్వాదం, డాక్టర్ సీహెచ్ సునీత

మొక్కలు నాటిన జేసీఐ సభ్యులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కొలనుకొండ జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న సర్వీస్‌రోడ్‌లో మంగళవారం జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ సంస్థ (జేసీఐ) ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జేసీఐ జోన్ 4 అధ్యక్షులు జీఎస్ఎస్ వర్మ మాట్లాడుతూ జేసీఐ జైత్ర పేరుతో నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా స్థానిక జేసీఐ శాఖ, విజయవాడ ఇంపాక్ట్ ఆధ్వర్యంలో సర్వీస్‌రోడ్‌లో 100మొక్కలు నాటినట్లు తెలిపారు. ధ్వని కాలుష్యం తగ్గించడానికి వాహనదారులను అనవసరంగా హారన్ మోగించవద్దని కోరుతూ ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో జేసీఐ జోన్ కో ఆర్డినేటర్ భరత్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, రీజియన్ సీ జోన్ వైస్ ప్రెసిడెంట్ రాజేష్, స్థానిక జేసీఐ శాఖ అధ్యక్షులు స్వాతి, వీక్ కో ఆర్డినేటర్ గణేష్‌బాబు, ప్రాజెక్ట్ డైరెక్టర్లు లక్కం రవీంద్రరెడ్డి, రవికిరణ్, వీరారెడ్డి, సందీప్, పళ్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కొలనుకొండ జాతీయ రహదారి సర్వీస్ రోడ్‌లో మొక్కలు నాటుతున్న జేసీఐ అధ్యక్షులు

ఎట్టకేలకు కొండచిలువ పట్టివేత

తాడేపల్లిరూరల్: ఎట్టకేలకు కొండచిలువను మంగళవారం సాయంత్రం పట్టుకున్నారు. కొండచిలువ ఆరు నెలలుగా కోళ్లను తినేస్తూ తప్పించుకుని తిరుగుతోంది. కార్పొరేషన్ పరిధిలోని నులకపేటలో ఉన్న బిస్మిల్లా చికెన్ సెంటర్‌కు అనుసంధానంగా కోళ్ల ఫారం ఉంది. ఆరు నెలలుగా ప్రతి రోజూ కోళ్లు మాయమౌతున్నాయి. రెండు మూడు సార్లు కొండచిలువను షాపు యజమాని నజీర్ చూసి దానిని పట్టుకునేందుకు ప్రయత్నం చేశాడు. రెండుసార్లు తప్పించుకుంది. మంగళవారం కోళ్లఫారంలోకి కొండ చిలువ రావడంతో కోళ్లు అరిచాయి. కోళ్లఫారంలోకి వెళ్లి చూడగా కోళ్లపై దాడిచేసేందుకు కొండచిలువ ప్రయత్నం చేసింది. వెంటనే నులకపేటలో పాములను పట్టుకునే ఆరోగ్యంని పిలిపించగా కొండ చిలువను పట్టుకునేందుకు ప్రయత్నించాడు. అది పైపైకి రావడంతో స్థానికంగా ఉన్న వారు భయభ్రాంతులకు గురయ్యారు. ఎట్టకేలకు ఆరోగ్యం ఆ కొండచిలువను బంధించాడు. చేపలను బంధించే ఆపాలో ఆ కొండచిలువను ఉంచగా స్థానికంగా ఉన్న యువకులు కొండచిలువను చూసేందుకు భారీగా చేరుకుని ముడి విప్పదీయడంతో ఒక్కసారిగా పైకి లేచి పరుగులు తీసింది. ఎట్టకేలకు తిరిగి ఆ కొండచిలువను బంధించి బ్రహ్మానందపురంలోని ఫారెస్ట్ ఏరియాలో వదిలిపెట్టారు.



కొండచిలువను పట్టుకున్న ఆరోగ్యం

కష్టపడి పనిచేస్తే ఉపాధ్యాయులకు గుర్తింపు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులకు గుర్తింపు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ తెలిపారు. ఎల్డర్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవానంది నేషనల్ అవార్డ్స్–2023 అందుకున్న లాలుపురంలోని కాటూరి పబ్లిక్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు చివుకుల సాంబశివరావును తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. డీఈఓ శైలజ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా సైన్స్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సాంబశివరావు విజ్ఞానంతో వినోద కార్యక్రమాల ద్వారా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో లక్షన్నర మంది విద్యార్థులకు మాథ్స్, సైన్స్, ఎలక్ట్రానిక్స్ ప్రయోగాలపై శిక్షణ అందించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న తీరు అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో కాటూరి పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, జీవీఆర్ పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్‌పై నుంచి పడి కార్మికుడి మృతి

గుంటూరు రూరల్: ప్రమాదవ శాత్తూ స్పిన్నింగ్ మిల్లులో పనిచేస్తూ పైనుంచి జారిపడి కార్మికుడు మృతి చెందిన ఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం ఒరిస్సాకు చెందిన గోపాల్ ప్రధాన్(22) చౌడవరం గ్రామంలోని బలరామకృష్ణ స్పిన్నింగ్ మిల్లులో కార్మికుడుగా చేరాడు. మిల్లులో పై ఫ్లోర్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడ్డాడు. దీంతో తీవ్ర గాయాలపాలవ్వగా తోటి కార్మికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

ఘటనపై మృతుని తండ్రి దుర్యోధన్ ప్రధాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధురాలు మృతి

తెనాలిరూరల్: ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చెంచుపేటలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పానుకుమాలి శివకుమార్, రాధ(63) దంపతులు నివసిస్తున్నారు. సోమవారం ఉదయం టీ పెట్టేందుకు వెళ్లిన ఆమెకు ప్రమాదవశాత్తు మంటలు అంటుకుని తీవ్రంగా గాయపడింది. తెనాలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం విజయవాడలోని మరో వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందింది. వైద్యశాల నుండి వచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేఎల్‌యూలో అవార్డుల ప్రదానం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ మండలం వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో పూర్వ విద్యార్థుల విభాగం అవార్డులు–2023 కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారావులు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. పూర్వ విద్యార్థుల విభాగ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ కావ్య మాట్లాడుతూ విభిన్న రంగాల్లో తమకంటూ ప్రత్యేక స్థానాన్ని సాధించుకున్న పూర్వ విద్యార్థులకు అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించామని అన్నారు. కార్యక్రమంలో ప్రొ. వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, అంతర్జాతీయ సంబంధాల విభాగ డైరెక్టర్ ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ కె.శరత్, తదితరులు పాల్గొన్నారు.

చర్మకార సంక్షేమ సంఘం అధ్యక్షునిగా కిషోర్‌కుమార్

తాడేపల్లిరూరల్: ఏపీ చర్మకార సంక్షేమ సంఘం అధ్యక్షులుగా దుగ్గిరాల మండలం పెదకొండూరు గ్రామానికి చెందిన కొండూరు కిషోర్‌కుమార్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు బుల్లా రాజారావు నియామక పత్రాన్ని మంగళగిరిలోని ఏపీ చర్మకార సంక్షేమ సంఘం కార్యాలయంలో కిషోర్‌కుమార్‌కు అందజేశారు. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని చర్మకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా పని చేస్తానని, చర్మకారులకు ప్రభుత్వం వచ్చే రుణాలు, పథకాలపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానని అన్నారు.

కారు చోరీపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఎస్ఐ కారు చోరీకి గురైన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఈనెల 9వ తేదీ మహర్షి యాదవ్‌నగర్‌లో నివసిచే రిజర్వు ఎస్ఐ మదన్ మోహన్ ఇంటికి తాళాలు వేసి విధులకు హాజరయ్యాడు. విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లేటప్పటికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి పరిశీలించగా, కారు తాళాలు, సెల్‌ఫోను, పర్సు కనిపించలేదు. బయటకు వచ్చి చూడగా కారు చోరీకి గురైనట్లు గుర్తించాడు. నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం

గుంటూరు ఈస్ట్: బాలిక కనిపించకుండా పోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. దుర్గా నగర్‌లో నివసించే ఓ కుటుంబానికి చెందిన 17 సంవత్సరాల బాలిక సోమవారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లిపోయింది. ఆమె ఆచూకి కోసం వెతికిన కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకుని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక డ్రైవ్

- పారిశుద్ధ్య నిర్వహణలో అందరూ భాగస్వాములు కావాలి
- ఆరోగ్యాధికారి డాక్టర్ హెలెన్ నిర్మల

తెనాలిఅర్బన్: పారిశుద్ధ్య నిర్వహణలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల సూచించారు. తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 14, 23 వార్డులలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌ను నిర్వహించారు. చంద్రబాబునాయుడు కాలనీలోని మురుగును బయటకు పంపడంతో పాటు కాల్వలో పూడిక తీత పనులు చేశారు. అలాగే దోమలు వ్యాప్తి కాకుండా కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేశారు. అలాగే పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్‌ను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 40 వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌ను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదటిగా శివారు ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఆమె వెంట పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, సిబ్బంది ఉన్నారు.



మహిళ సమస్య అడిగి తెలుసుకుంటున్న ఆరోగ్యాధికారిణి హెలెన్ నిర్మల

ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తున్నారు

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందన సత్కారం

తెనాలి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు స్వీకరించిన స్థానిక అయితానగర్‌లోని ఎస్ఎస్ఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను మంగళవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయిని షేక్ అస్మతున్నీసా, చిత్రకళ ఉపాధ్యాయుడు బెల్లంకొండ వెంకట్‌లు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ఈనెల 5వ తేదీన జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి చేతులమీదుగా స్వీకరించిన విషయం తెలిసిందే. దీనిని పురస్కరించుకుని ఆ ఇద్దరు ఉపాధ్యాయులకు అభినందన సభను ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు రాజకిషోర్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి జయంత్‌బాబు మాట్లాడుతూ మున్సిపాలిటీకి చెందిన ఒకే ఉన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు రావటం గొప్ప విషయమన్నారు. చిత్రకారుడిగా, ఎన్‌సీసీ అధికారిగా బెల్లంకొండ వెంకట్ చేసిన కృషికి ప్రభుత్వ గుర్తింపు లభిస్తే, తెలుగు ఉపాధ్యాయినిగా, కవయిత్రిగా అస్మతున్నీసా అదే అవార్డును దక్కించుకున్నారని చెప్పారు. స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థుల మధ్య వీరిని సత్కరించుకోవటం స్ఫూర్తిదాయకమన్నారు. ఒకటో వార్డు కౌన్సిలరు గెద్దేటి సురేంద్ర మాట్లాడుతూ ఇక్కడి పాఠశాలలో ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేస్తున్నారని ప్రశంసించారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను అభినందించారు. పదోతరగతిలో అత్యధిక ఉత్తీర్ణత సాధించినందుకు ఆ తరగతికి బోధించిన పఠాన్ జాన్‌బీ, ప్రసాద్, రాయన్న, ప్రసూనాదేవి, బాలమ్మ, సునీత, ఆదిలక్ష్మి, వెంకటరమణ, రాబియా బాసరి, ఆంజనేయ శర్మ, ప్రకాశరావులను ఇదే వేదికపై సత్కరించారు. బడుగు ప్రకాశరావు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, పీఈటీలు పర్యవేక్షించారు.



అస్మతున్నీసాకు సత్కారం

సమగ్ర ఓటరు సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

తెనాలిరూరల్: నియోజకవర్గంలో జరుగుతున్న సమగ్ర ఓటరు సర్వే తెనాలి పట్టణం, మండలంలోనూ కొనసాగుతోందని, ప్రజలు, రాజకీయపార్టీల నాయకులు సహకరించాలని తహసీల్దార్ కె. రవిబాబు కోరారు. స్థానిక కొత్తపేటలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తహసీల్దార్‌తో పాటు మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సుబ్బారావు సమావేశంలో పాల్గొని తెనాలి మండలంలో జరుగుతున్న సమగ్ర ఓటరు సర్వే గురించి చర్చించారు. పలువురు నాయకులు వారి అభిప్రాయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రవిబాబు, సుబ్బారావు మాట్లాడుతూ, సమగ్ర ఓటరు సర్వే కార్యక్రమం తెనాలిలో జరుగుతుందన్నారు. నియోజకవర్గ పరిధిలోని 273 పోలింగ్ బూత్‌ల పరిధిలో బీఎల్‌వోలు ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారని తెలిపారు. బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి పరిశీలన చేయడం జరుగుతుందన్నారు. కొత్తగా ఓట్లు నమోదు, ఓటరు జాబితాలో డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు బీఎల్‌వోలు గుర్తించాల్సి ఉంటుందన్నారు. బీఎల్‌వోలతో పాటు పార్టీల నుండి బూత్ లెవల్ ఏజెంట్లు ఇంటింటి సర్వేలో పాల్గొనవచ్చని చెప్పారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఏమైనా సందేహాలు/సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. సమావేశంలో వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రవిబాబు

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి

తెనాలిఅర్బన్: నాడు–నేడు రెండవ విడత పనులు త్వరగా పూర్తి చేయాలని సమగ్ర శిక్ష అడిషనల్ కో–ఆర్డినేటర్ ఎం.విజయలక్ష్మి ఆదేశించారు. తెనాలి, కొల్లిపర మండలాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో అదనపు తరగతి గదులు, ఇతర మౌలిక వసతుల కల్పన నాడు–నేడు ద్వారా చేస్తున్నట్లు చెప్పారు. పూర్తి అయిన పనులను ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడంతో పాటు వాటి వివరాలను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో జరిగే పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఏవైనా ఇబ్బందులు ఏర్పడితే జిల్లా అధికారులను సంప్రదించాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు, సచివాలయ ఎమినిటీస్ సిబ్బంది సమన్వయంతో పనులు పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో తెనాలి, కొల్లిపర మండల విద్యాధికారులు ఎం.లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు, జి.సల్మాన్ రాజు, కె.జాన్సీలత, మున్సిపల్ డీఈ నాగభూషణం, ఏఈలు రాజఫణీంద్ర, ఆంజనేయరాజు, చైతన్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ విజయలక్ష్మి

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

గ్రామదర్శిని కార్యక్రమంలో సీఐ జి. వేణుగోపాలరెడ్డి

బాపట్లటౌన్: బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ జి.వేణుగోపాలరెడ్డి హెచ్చరించారు. గ్రామదర్శిని కార్యక్రమంలో భాగంగా మంగళవారం కనకాద్రినగర్ ప్రజలకు చట్టాలపై ఆయన అవగాహన కల్పించారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ప్రతిరోజు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా వ్యవసాయ కూలీలను ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ఎక్కించుకుని, లౌడ్ స్పీకర్లు పెట్టి మితిమీరిన శబ్దంతో ప్రయాణిస్తున్నారన్నారు. దీంతో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. నిత్యం రద్దీగా ఉండే బాపట్ల – సూర్యలంక రోడ్డులో కనకాద్రినగర్, ముత్తాయపాలెం సెంటర్ సమీపంలో ఏర్పాటు చేసిన డివైడర్లకు ఇరువైపులా కూర్చొని కాలయాపన చేస్తున్నారని, దీంతో వేగంగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మహిళలు, విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, వారిని దుర్భాషలాడే వారిపై అధికంగా కేసులు నమోదవుతున్నట్లు చెప్పారు.

12 ఆటోలు... రూ.65 వేలు



ఆటోలను తనిఖీ చేస్తున్న ఆర్టీవో ప్రసాద్, ఎంవీఐ రాఘవరావు

ఆటోల తనిఖీలో జరిమానా విధింపు

తెనాలిరూరల్: ప్రయాణికులను తరలించే ఆటోలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. తెనాలి పట్టణం, వల్లమూడి, నారాకోడేరు వద్ద ఆటోలను ప్రాంతీయ రవాణా అధికారి ప్రసాద్, మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ రాఘవరావు, సహాయ మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ మధుసూదనరావు తమ సిబ్బందితో కలసి మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్న పలు ఆటోలను గుర్తించి అపరాధ రుసుం విధించారు. 12 వాహనాలకు కలిపి రూ. 65 వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆర్టీవో ప్రసాద్ మాట్లాడుతూ 12 ఏళ్ల లోపు వయసున్న విద్యార్థులను కేవలం ఆరుగురిని మాత్రమే ఆటోలో ఎక్కించుకోవాలని డ్రైవర్ పక్కన వెనుక డోర్‌తెరచి విద్యార్థులను/ప్రయాణికులను ఎక్కించుకోకూడదని డ్రైవర్లకు సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. ఆటోల్లో లౌడ్ స్పీకర్లు పెట్టడం, డ్రైవర్ పక్కన కూర్చునే విధంగా ఏర్పాట్లు చేసిన ఆటోలను అవసరమైతే సీజ్ చేస్తామని హెచ్చరించారు. విద్యార్థుల బ్యాగులు, లంచ్ బాక్సులు ఎట్టిపరిస్థితుల్లోనూ వాహనానికి బయట వేలాడదీయకూడదన్నారు. కొద్ది రోజుల పాటు ఆటోల తనిఖీ ప్రత్యేక డ్రైవ్‌గా నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు.